క్లుప్తంగా

అవగాహన సదస్సు

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో సోమవారం భేటీ బచావో–భేటీపడావో, లింగ వివక్ష, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ హాజరై మాట్లాడారు. మహిళలు, బాలికలు ఎలాంటి ఆపదలో ఉన్నా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ 14567 నంబర్లకు డైల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

కాకా వెంకటస్వామి స్మారక క్రికెట్ పోటీలు

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 12నుంచి 17వరకు పెద్దపల్లి మాజీ ఎంపీ కాకా వెంకటస్వామి స్మారక చెన్నూర్ మున్సిపాలిటీ స్థాయి క్రికెట్ పోటీలను విశాఖ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాతర్ల నాగరాజు, చెన్నూరి రాజేశ్, మధు, సంతోశ్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్ల వివరాలను ఈ నెల 9నుంచి నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఈ కింది నంబర్లు 73861 61370, 7569801416లకు సంప్రదించాలని కోరారు.

అధికారులకు వినతి

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని కత్తెరశాల రోడ్డులో గల సర్వే నంబర్ 863లో గల ప్రభుత్వ భూమిని జర్నలిస్టులకు కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు గుర్తించిన 8.05ఎకరాల భూమిని కొందరు అక్రమార్కులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున్, సీఐ వాసుదేవరావు, మున్సిపల్ ఏఈ సాయికృష్ణకు సోమవారం వినతిపత్రాలు అందజేసినట్లు ప్రెస్‌క్లబ్ చెన్నూర్ నాయకులు తెలిపారు. స్థలాన్ని కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చెన్నూర్ జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

తాండూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న శక్తి సామర్థ్యాల్ని మరింత పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ప్రభాకర్ అన్నారు. మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఎస్.మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్, రిసోర్స్ పర్సన్లు విద్యాసాగర్, వేణుగోపాల్, రజిత తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ కౌన్సెలర్ మృతి



వంశీకృష్ణారెడ్డి (ఫైల్)

బెల్లంపల్లి: మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తోడే వంశీకృష్ణారెడ్డి(38) మృతిచెందాడు. 2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పూర్వ మున్సిపల్ వార్డు 23నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందాడు. 2019వరకు ఆ పదవిలో కొనసాగారు. కిడ్నీ సంబంధమైన అనారోగ్య సమస్యలతో ఆయన సుదీర్ఘకాలం నుంచి బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచాడు. మృతదేహాన్నీ మంచిర్యాలలోని స్వగృహానికి తీసుకొచ్చి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, కొడుకు, అమ్మ, సోదరుడు ఉన్నారు. కాగా వంశీ కృష్ణారెడ్డి అకాల మృతిపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు ప్రవీణ్, మున్సిపల్ కాంగ్రెస్‌మాజీ ఫ్లోర్ లీడర్ కటకం సతీష్ సంతాపం ప్రకటించారు. ఆయన తల్లి సీడీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలైన పద్మారెడ్డిని ఓదార్చి సానుభూతి తెలిపారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ స్వయంగా శ్మశానవాటిక వరకు వంశీకృష్ణారెడ్డి పాడే మోసి ఔదార్యాన్ని చాటుకున్నారు.



అక్షింతలు పంపిణీ

రామకృష్ణాపూర్/లక్సెట్టిపేట/మందమర్రిరూరల్: అయోధ్య రాముడి అక్షింతలను సోమవారం ఊరూరా పంపిణీ చేశారు. ఊరేగింపు తీస్తూ, నృత్యాలు చేస్తూ బాజాబజంత్రీలతో ఇంటింటా అందజేశారు. కార్యక్రమంలో ఆలయాల అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ఘనంగా భీమదేవర పండుగ



నెన్నెల: జెండా పండుగలో పాల్గొన్న మన్నేవార్‌లు

తాండూర్: మండల కేంద్రంలో భీమదేవర జెండా పండుగను సోమవారం ఆదివాసీలు ఘనంగా నిర్వహించారు. జెండా వద్ద ఆదివాసీలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెండా ఎగురవేశారు. ఈ నెల 22న ఆత్మగౌరవ భీమదేవర జెండా పండుగను నిర్వహించనున్నట్లు ఆదివాసీ కోలావార్ సేవా సంఘం మండల అధ్యక్షుడు గాలిశెట్టి బాపు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు టీకం రాజయ్య, తుడుం దెబ్బ మండల ప్రధాన కార్యదర్శి యాపల సమ్మయ్య, నాయకులు చిలుకయ్య, మహేష్, పోషం, నాగయ్య, సన్నాసి, ఎర్రయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో భీమన్న జెండా పండుగ ఆదివాసీ కొలావార్ మన్నెవార్ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. గిరిజనులు, గిరిజనేతరులు ఈ భీమదేవర జెండా పండుగలో పాల్గొన్నారు. భీమదేవుడి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఆదివాసీ సంఘం అధ్యక్షులు కొడిపె వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లయ్య, నాయకులు లక్ష్మీనారాయణ, నరేష్, భీమేష్, వెంకటి పాల్గొన్నారు.

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లిలో ఆదివాసీ కొలవార్(మన్నేవార్)లు భీమదేవర ఆత్మగౌరవాన్ని పురస్కరించుకొని సోమవారం భీమదేవర జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్, గిరిజన నాయకుడు బద్ది రాజన్న జెండా ఆవిష్కరించారు. ఆదివాసీ మన్నేవార్‌లను అన్ని రంగాల్లో ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, ఏఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి సమ్మయ్య, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి మండిగ సంతోష్, నాయకులు బకన్న, మల్లన్న, శంకర్ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ముల్కల్లలో సోమవారం 22వ ఆదివాసీ ఆత్మగౌరవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు ఆదివాసీ కోలవార్ సంఘ నాయకులతో పాటు ముల్కల్ల సర్పంచ్ మంచాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివాసీ ఆత్మగౌరవ దినోత్సవంతో పాటు భీమదేవర జెండా పండగలో భాగంగా పతాకాన్ని ఆవిష్కరించారు. కొలావార్ కులబాంధవులను ప్రభుత్వం ఆదుకోవాలని సంఘ నేతలు డిమాండ్ చేశారు. వేడుకల్లో గడ్డం తిరుపతి, మధునయ్య, రాములు, మొగిళి పోశం, రమేశ్, భీమక్క, రాజు, రాజేశ్ పాల్గొన్నారు.



ముల్కల్లలో పాల్గొన్న సర్పంచ్, స్థానికులు



భీమిని: నృత్యం చేస్తున్న భక్తులు



డీజే చప్పళ్ల మధ్య డ్యాన్స్‌లు వేస్తున్న భక్తులు

గిరిజనుల ఇబ్బందులు గుర్తించండి

- లోతొర్రే గిరిజనుల వేడుకోలు



మాట్లాడుతున్న లోతొర్రే గ్రామస్తులు

జన్నారం: కవ్వాల్ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండటమే కాకుండా మధ్యలో వాగులు ఉండటం వల్ల గర్భిణులకు వైద్య చికిత్స అందడం ఇబ్బందికరంగా మారిందని, అనారోగ్యం భారిన పడిన వాళ్లకు వైద్యం కరువవుతుందని, మా గ్రామంలోని గిరిజనుల ఇబ్బందులు గుర్తించి ఆదుకోవాలని జన్నారం మండలం లోతొర్రే గ్రామస్తులు అధికారులను వేడుకున్నారు. కలెక్టర్‌కు ఈ సమస్యలపై వినతులు ఇచ్చినట్లు తెలిపారు. మండల కేంద్రంలో పలువురు గిరిజనులు సోమవారం విలేకరులతో మాట్లాడారు. లోతొర్రేలో హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఆశవర్కర్లు, హెల్త్ సిబ్బంది మా గ్రామానికి రావడానికి ఇబ్బంది పడుతున్నారని, వారికి ఫోన్‌చేస్తే గర్భిణులను వారి వద్దకు రమ్మని అంటున్నారని వాపోయారు. గర్భిణులు నడుచుకుంటూ వారి వద్దకు ఎలా వెళ్తారని ఆవేధన వ్యక్తం చేశారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక, మధ్యలో వాగు ఉండటం వల్ల అంబులెన్స్‌లు రావడం లేదన్నారు. వర్షకాలంలో వాగులు పొంగి అనేక మంది అనారోగ్యాల భారిన పడి చనిపోయిన సందర్భాలున్నాయన్నారు. లోతొర్రే గ్రామానికి రోడ్డు సౌకర్యంతో పాటు, వాగుపై వంతెన నిర్మించి, గ్రామంలో హెల్త్ సెంటర్, ఆశ వర్కర్లను నియమించాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. సమావేశంలో ఆ గ్రామ పెద్ద పటేల్ కుర్సింగ గంగరాం, గ్రామ పెద్దలు బహదూర్ షా, ప్రకాశ్, జగదీశ్, అర్జున్, దినకర్‌షా, జంగు, భరత్, గాగ్రూ, రాంసావా తదితరులున్నారు.

భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మడావి వంశస్థులు

జన్నారం: మడావి వంశస్థుల కులదైవం భీమన్న దేవుడికి తిర్యాని మండలం డోలి జండగూడ గ్రామానికి చెందిన మడావి వంశస్థులు ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజులుగా కాలినడకన డోలి జండగూడ నుంచి బయలుదేరిన వారు సోమవారం ఉదయం జన్నారం మండలం కొత్తపేట గ్రామ పంచాయతీ కొలాంగూడకు చేరుకున్నారు. అక్కడ ఆదిమ కొలాం జాతి మడావి సంప్రదాయం ప్రకారం కొత్తకోడళ్ల పరిచయ కార్యక్రమం చేశారు. ఇద్దరు కొత్తకోడళ్లు మడావి గుమ్ము, శాంత దంపతులు సంప్రదాయ బద్ధంగా పూజలు జరిపారు. ఈ సందర్భంగా కుల పెద్దలు మాట్లాడుతూ.. కులదైవం భీమన్న దేవుడిని ప్రార్థించడం, కొలువడం వల్ల పంటలు బాగా పండి ఆయురారోగ్యాలతో ఉంటామని తెలిపారు. ఏటా కుల దైవానికి పూజలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కుల పూజారి మడావి బాడవి, కుల పెద్దలు మడావి బాపురావు, ఝుడు, బొజ్జు, మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లిలో సర్వే అడ్డుకున్న బాధితులు



బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల–ఆర్మూర్ నాలుగు వరసల జాతీయ రహదారి 63నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ సర్వే పనులను సోమవారం వేంపల్లి గ్రామ శివారులోని బాధితులు, రైతులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా మా భూముల్లో ఎలా సర్వే చేస్తారని, సర్వే సిబ్బందిని అడ్డుకుని నిలదీశారు. దీంతో సమాచారం అందుకున్న తహసీల్దార్ సతీశ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకోగా బాధితులు చుట్టుముట్టి సర్వే చేస్తే అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. వారం రోజులుగా నాలుగు వరసల రహదారికి సంబంధించి పెగ్ మార్కింగ్ సర్వే పనులు సాగుతున్నాయని, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, ఆర్డీఓలకు విన్నవించాలని తహసీల్దార్ బాధితులకు సూచించారు. ఈ సర్వే ఎట్టి పరిస్థితుల్లో ముందుకు సాగనివ్వమని, కొంతమంది స్వార్థం కోసం అలైన్‌మెంట్‌లను మార్చి ఇప్పుడు మాకు నష్టం కలిగించేలా కొత్త అలైన్‌మెంట్ ప్రకారం సర్వే చేపడితే అడ్డుకుంటామని స్పష్టంగా సూచించారు. గ్రీన్‌హైవే పేరుతో చేపడుతున్న భూ సేకరణ సర్వే కూడా తమకు అన్యాయం జరిగేలా ఉందని, పాత గ్రీన్‌హైవే ప్రకారమే భూ సేకరణ జరిపేలా చూడాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవన్నారు. తహసీల్దార్ వెంట గిర్దావర్‌లు మంగ, ప్రభు, సర్వేయర్ కృష్ణప్రియ, సర్వే సిబ్బంది, రైతులు, ఇతర భూ బాధితులు ఉన్నారు.

‘గ్రీన్‌ఫీల్డ్ హైవేతో విలువైన భూములు కోల్పోతున్నాం’



ఆందోళన చేస్తున్న ప్లాట్ల యజమానులు

రామకృష్ణాపూర్: గ్రీన్‌ఫీల్డ్ హైవే–63 ఏర్పాటుతో ఎంతో విలువ చేసే భూములను కోల్పోతున్నామని, తక్షణమే గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్లానింగ్ మార్చాలని క్యాతనపల్లి ఎంఎస్‌ఆర్ గార్డెన్స్ సమీపంలోని ఇళ్లు, ప్లాట్ల యజమానులు సోమవారం సర్వే నిమిత్తం వచ్చిన రెవెన్యూ, హైవే అధికారుల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తాము, భవిష్యత్ అవసరాల కోసం ఏళ్ల తరబడి పొదుపు చేసిన మొత్తంతో ఎంఎస్‌ఆర్ గార్డెన్ వద్ద ప్లాట్లు కొనుగోలు చేశామని, ఇప్పుడు హైవేలో ఆ ప్లాట్లతో పాటు ఇళ్లు పోతుండటంతో తమ ఆశలన్నీ వమ్ము అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హైవే ప్లానింగ్ డిజైన్‌ను మార్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

డాటా ఎంట్రీ పరిశీలన

భీమిని: ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ సూచించారు. కన్నెపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న ఆన్‌లైన్ డాటా ఎంట్రీని ఆయన సోమవారం పరిశీలించారు. 17వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాధాకిషన్, తహసీల్దార్ దత్తప్రసాద్ ఉన్నారు.

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. 5వేలకు పైగా దరఖాస్తులు రాగా, ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామని తెలిపారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

కోటపల్లి: మండలంలోని జనగామ గామపంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్రను సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించి పథకాలతో లబ్ధిపొందిన వారితో మాట్లాడి అభిప్రాయాలను సేకరించారు.

జన్నారం: మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కు భూమేశ్, ఈవో రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈపీఎఫ్ డబ్బులు జమ చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఈపీఎఫ్ డబ్బులు వారి పీఎఫ్ ఖాతాలలో జమ చేయాలని నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొయ్యల వెంకటి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఆయన నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మద్దెర్ల సతీష్, కోశాధికారి మాడ్గుల రాజం, నాయకులు జాబ్రీ హబీబ్, డీ రాజేశ్వర్, టీ రమేశ్, గణేష్, స్వామి, మొగిళి, రాజం, రాజేశ్వరి, పద్మ, రజిత, జ్యోతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

‘రజకులను ఆదుకోవాలి’

పాతమంచిర్యాల: రజక వృత్తిదారులను ఆదుకోవాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తంగళ్లపల్లి వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అడిషనల్ కలెక్టర్ రాహుల్ చేతుల మీదుగా తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మున్సిపాలిటీలో మోడ్రన్ ధోబీ ఘాట్‌లు నిర్మించాలని అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు.

‘ధ్యానంతో ప్రశాంతత, ఆలోచనలో స్పష్టత’

మంచిర్యాలఅర్బన్: హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన పద్ధతులు నేర్చుకోవటం వల్ల ప్రశాంతత, ఆలోచనలో స్పష్టత, మెరుగైన జీవన విధానం అలవాటు పడుతుందని హార్ట్‌ఫుల్‌నెస్ జోనల్ కో–ఆర్డినేటర్ సతీష్ అన్నారు. స్ట్రెస్ మేనేజ్మెంట్, రిలాక్సేషన్ ధ్యాన పద్ధతులు, బ్రెయిన్ ఎక్సర్‌సైజులు, స్వామి వివేకానందుడి జీవిత విధానం పలు అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, హార్ట్ ఫుల్‌నెస్ జిల్లా కో–ఆర్డినేటర్ ప్రవీణ, సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కోటపల్లి: మహిళలు గర్భంతో ఉన్నప్పుడు పౌష్టికాహారం తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి గర్భిణులకు సూచించారు. గర్భిణులకు వైద్యపరీక్షల అనంతరం గర్భిణీ పట్టిక, ఐరెన్ మాత్రలు, తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో నార్మల్ ప్రసవాలు అయ్యేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు గౌతమి, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

11న రక్తదాన శిబిరం

మంచిర్యాలటౌన్: ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవంగా ఆ రోజును నిర్వహిస్తుండగా, రెడ్‌క్రాస్ వారి బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు బ్లడ్ డొనేషన్ క్యాంప్ సభ్యులు వి.మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం 10గంటలకు మంచిర్యాల పట్టణంలోని గోదావరి రోడ్డులో ఉన్న ఏకలవ్య ఆశ్రమంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు, అనంతరం విద్యార్థులకు మానసిక పరివర్తన, ఆధ్యాత్మిక సదస్సును హార్ట్‌ఫుల్‌నెస్ అనే సంస్థ ద్వారా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో గల గాంధీనగర్, ఒర్రెగడ్డ ఏరియాల్లో నెలకొన్న సమస్యలను ఆ ఏరియా యువకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు దృష్టికి తీసుకెళ్లారు. వార్డులో రోడ్లు సరిగా లేవని, మిషన్ భగీరథ వాటర్ సరఫరా కావడం లేదని, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని, వీధి దీపాల సమస్యలను వివరించారు. ఈ విషయంపై కమిషనర్ సానుకూలంగా స్పందించి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని యువకులు తెలిపారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో సీసీఐ పత్తి కొనుగోళ్లు ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు సీసీఐ సీపీవో ఉదయ్‌షా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ నుంచి యధావిధిగా కొనుగోళ్లు కొనసాగుతాయని తెలిపారు.

‘ప్రజావాణి’ సద్వినియోగం చేసుకోండి



భీమారంలో ప్రజావాణిలో పాల్గొన్న ఎంపీడీవో

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా ఎంపీడీఓ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రజలు సమస్యలను లిఖితపూర్వకంగా అందజేయాలని కోరారు. ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్క దరఖాస్తు కూడా రాలేదని తెలిపారు. ఇందులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘కబ్జాకు గురవుతుందని ఫిర్యాదు’

చెన్నూర్‌రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో చెన్నూర్‌లోని కుమ్మరికుంట చెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతుందని సోమవారం కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ఎన్నికల కోడ్‌సమయంలో కొందరు భూకబ్జాదారులు చెరువు శిఖం భూమిని కబ్జా చేసుకొని సర్వే నెంబర్ 971లో ఇల్లు నిర్మించుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై గతంలో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు శిఖం భూమిలో నిర్మించిన కట్టడాలను తొలగించాలని, ఇందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెన్నూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, ఒకటో వార్డు కౌన్సిలర్ పోగుల సతీశ్, నాయకులు చెన్నూరి శ్రీధర్, పాతర్ల నాగరాజు, బొడ్డు రాకేష్, మహేష్, సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, ముత్యాల రవి, ఉదయ్, సాహీర్, కరీం తదితరులు పాల్గొన్నారు.



బైపాస్‌రోడ్‌లో పడేసిన కోడి వ్యర్థాలు, చనిపోయిన కుక్క(వృత్తంలో)

కంపుకొడుతోంది..!

మంచిర్యాలఅర్బన్: పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా రద్దీని తగ్గించటానికి నిర్మించిన బైపాస్ రహదారి కంపుకొడుతోంది. మంచిర్యాల లక్ష్మీటాకీస్ చౌరస్తా నుంచి వైశ్యభవన్ వరకు నూతనంగా సిమెంట్‌రోడ్ నిర్మించారు. రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు రంగు రంగుల విద్యుత్ వెలుగులు విరజిమ్ముతుంటాయి. ఈ రహదారిపై వాకింగ్ చేస్తుంటారు. తెలంగాణ తల్లి చౌరస్తా సమీపంలో ఎవరు చూస్తున్నారో..? ఏమో అనుకున్నారో కానీ రహదారిపైన కోడివ్యర్థాలు, చనిపోయిన కుక్కలు రహదారిపైనే పడేయటంతో కంపు కొడుతోంది. అటువైపు వెళ్లాలంటే ముక్కుపుటాలు అదురుతున్నాయి. సీసీ కెమెరాలు సమీపంలో ఉన్నా చెత్త, చెదారంతో పాటు వ్యర్థాలు పడేయటంతో ఇబ్బందులు తప్పటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలు పడేయకుండా చూడాలని కోరుతున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్(ఆర్‌యూపీపీ) ఆధ్వర్యంలో ముద్రించిన 2024క్యాలెండర్‌ను డీఈవో యాదయ్య ఆవిష్కరించారు. డీఎస్‌వో మధుబాబు, ఉపాధ్యాయ సంఘం నేతలు సత్యనారాయణ, సురేందర్, జనార్దన్, నీల్ కమల్, రమేష్, మధుసూధనచారి పాల్గొన్నారు.

టీఎస్‌టీయూటీఎఫ్..

మంచిర్యాలఅగ్రికల్చర్: టీఎస్‌టీయూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంచిర్యాల సమీకృత కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ సంతోష్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. జిల్లా విద్యాధికారి యాదయ్య, జిల్లా అధ్యక్షుడు రామన్న, ఉపాధ్యక్షుడు చక్రపాణి, కోశాధికారి కిరణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్


విశ్రాంత ఉద్యోగుల సంఘం...



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై ప్రసాద్

దండేపల్లి: మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024క్యాలెండర్, డైరీని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కుందారపు ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శంకర్ గౌడ్, లచ్చన్నబాపు, నాయకులు కాంతయ్య, సత్యనారాయణ, లక్ష్మణ్, సుగుణాకర్ పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం



తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్ సింగరేణి కాలరీస్ హైస్కూల్‌లో విద్యనభ్యసించిన 1998–99 సంవత్సరపు పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. పాత మిత్రులను కలుసుకొని ఒకరికొకరి పాత మధురాలను పంచుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు చిన్న నాడు ఆడుకున్న ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేసుకున్నారు.